సాక్షి నంద్యాల

ఆదివారం • 28 • జనవరి • 2024




కేసీకి నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. డ్యాంలో 0.4 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ దక్షిణమాఢవీధి లోని నిత్యకళావేదికపై శనివారం హైదరాబాద్‌కు చెందిన ఎన్.అనురాధ బృందం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది.



'వాల్మీకి' దృశ్య కావ్యం

ప్యాపిలి మండలం నల్లమేకలపల్లి దగ్గర సహజ సిద్ధంగా ఏర్పడిన వాల్మీకి గుహలు పర్యాటకులను విశేషంగా ఆకరిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గుహలను అభివృద్ధి చేసింది.

IIలో ▸

న్యూస్‌రీల్

30న ఆళ్లగడ్డలో జాబ్ మేళా

ఆళ్లగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 30వ తేదీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివరామయ్య శనివారం తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవప్‌లప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాకు వివిధ ప్రైవేట్ కంపెనీలు హాజరవుతాయన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, బీటెక్ తదితర కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కృష్ణానదిలో చేపల మృత్యువాత



నీటిలో తేలాడుతున్న మృతి చెందిన చేపలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం దిగువ భాగంలోని కృష్ణానదిలో మూడురోజులుగా చేపలు మృత్యువాత పడి తేలియాడుతూ కనిపిస్తున్నాయి. దీంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. డ్యాం ఎగువ భాగంలో చేపలు జీవించి ఉన్నాయని, దిగువ భాగంలో నదిలో నీరు కలుషితం కావడం వల్లే ఇలా జరుగుతోందని చెబుతున్నారు. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో జనరేటర్ల మరమ్మతులకు వాడుతున్న కెమికల్ ప్రభావంతో చేపలు చనిపోయి ఉండవచ్చని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గడం, ఆల్గే (పీచు,నాచు) పేరుకుపోవడం వంటి కారణాలతో చేపలు మృత్యువాత పడుతుంటాయి. విషయం తెలుసుకున్న మత్స్యశాఖ అధికారులు నీటి శాంపిళ్లను సేకరించి పరీక్షల నిమిత్తం పంపారు.



రూ. 36 కోట్లతో నిర్మించిన బీసీ బాలుర స్కూల్, కళాశాల



రూ. 4 కోట్లతో నిర్మించిన ఎంఎస్ఎంఈ సెంటర్ భవనం



రూ. 8 కోట్లతో పూర్తయిన ఐటీఐ కళాశాల భవనం

జగనన్నతో చదువుల విప్లవం

- పేద విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు
- ఎడ్యుకేషన్ హబ్‌గా డోన్ నియోజకవర్గం
- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- బీసీ బాలుర రెసిడెన్సియల్ స్కూలు, కళాశాల ఐటీఐ, ఎంఎస్ఎంఈ సెంటర్ నూతన భవనాలు ప్రారంభం



ఐటీఐ కళాశాలను ప్రారంభిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి తదితరులు

బేతంచెర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చదువుల విప్లవం వచ్చిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామ సమీపంలో కర్నూలు రహదారిలో రూ. 36 కోట్లతో నిర్మించిన బీసీ బాలుర రెసిడెన్సియల్, స్కూలు, కళాశాల, రూ.8 కోట్లతో ఐటీఐ కళాశాల, రూ.4 కోట్లతో నిర్మించిన ఎంఎస్ఎంఈ నూతన భవనాలను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, డైరెక్టర్ ఉపాధి శిక్షణ శాఖ డాక్టర్ నవ్య, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసిందన్నారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పంతో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నారన్నారు. ప్రతి పేద విద్యార్థులు ఉన్నత చదువులే లక్ష్యంగా అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ క్రమంలో సీఎం వైఎస్ జగన్ ఎన్నో చరిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నారనిగుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాడు-నేడు మన బడి కార్యక్రమాన్ని చేపట్టి కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దామన్నారు. అలాగే జగనన్న విద్యా కానుక కిట్లు, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశామన్నారు. డోన్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దామన్నారు. గోరుమానుకొండ గ్రామ సమీపంలో 15 ఎకరాల విస్తీర్ణంలో బీసీ బాలుర రెసిడెన్షియల్ స్కూలు, కళాశాలను అధునాతన వసతులతో నిర్మించి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఐటీఐ కళాశాలల్లో చదివిన వారికి ఉపయోగకరంగా ఉండేలా ఇక్కడే ఎంఎస్ఎంఈ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ శిక్షణ పూర్తయితే ఉపాధి రంగంలో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రజలందరి ఆశీర్వాదంతో నాలుగేళ్ల కాలంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు.



కళాశాలలో మహాత్మాజ్యోతిబా పూలే చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన, ఎంపీ

రూ. 2,500 కోట్లతో అభివృద్ధి

మంత్రి అందుబాటులో లేరని ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలకు డోన్ నియోజకవర్గ అభివృద్ధే సమాధానమిస్తుందన్నారు. నియోజకవర్గంలో రూ. 2500 కోట్లతో చేసిన ప్రతి అభివృద్ధి పనిలో తానున్నానని స్పష్టం చేశారు. బేతంచెర్ల మండలంలో ప్రతి ఒక్క గ్రామానికి రహదారి సౌకర్యంతో పాటు దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.750 కోట్లతో జాతీయ రహదారి, రూ.350 కోట్లతో శాశ్వత ప్రాతిపదికన గోరుకల్లు రిజర్వాయర్ ఇంటింటికి శుద్ధమైన నీరు అందించే పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు.

- నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం డోన్ జిల్లాలో వెనుకబడిన ప్రాంతమని, ఇప్పుడు రాష్ట్రంలోనే అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ముందు చూపుతో అన్ని రంగాల్లో డోన్ అభివృద్ధి చెంది ఆదర్శ నియోజకవర్గంగా మారిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధికే పట్టం కడతారని, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారన్నారు. కార్యక్రమంలో డీఈఓ సుధాకర్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగరాజు, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి , రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బాబుల్ రెడ్డి, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మూర్తుజావలి, మైనార్టీ కార్పొరేషన్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్లు ఖాజా, మురళీ కృష్ణ, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రామనాథం పాల్గొన్నారు.

42 మంది ఎంపీడీఓలకు స్థానచలనం

- అనంతపురం జిల్లాకు 35 మంది, వైఎస్సార్ జిల్లాకు ఏడుగురు బదిలీ

కర్నూలు(అర్బన్): సాధారణ ఎన్నికల్లో భాగంగా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 42 మంది ఎంపీడీఓలను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ పీఆర్అండ్ఆర్‌డీ కమిషనరేట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించి 35 మందిని ఉమ్మడి అనంతపురం జిల్లాకు, ఏడుగురిని ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు బదిలీ చేశారన్నారు. వీరి స్థానంలో అనంతపురం జిల్లా నుంచి 23 మందిని, వైఎస్సార్ జిల్లా నుంచి 16 మంది ఎంపీడీఓలు ఉమ్మడి కర్నూలు జిల్లాకు రానున్నట్లు చెప్పారు. సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారితో పాటు మూడు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని బదిలీ చేశారన్నారు. పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్ ఆదేశాల మేరకు బదిలీలు వెంటనే అమల్లోకి వస్తాయన్నారు. ఇతర జిల్లాలకు బదిలీ అయిన వారిని వెంటనే రిలీవ్ చేసి వేరే జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చిన వారికి పోస్టింగ్స్ ఇచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు.

అనంతపురం జిల్లాకు బదిలీ అయిన వారు

ఉమ్మడి అనంతపురం జిల్లాకు బదిలీ అయిన వారిలో కే నరసింహమూర్తి, ఆర్ గీతావాణి, టీ అల్లాబకాష్, ఎం రాణెమ్మ, ఏసీ రాముడు, సీవీ కొండయ్య, ఎం గౌరీదేవి, ఎంజీ ప్రవీణ్‌కుమార్, ఎంహెచ్ సుహాసినమ్మ, ఎస్ చంద్రశేఖర్, పీ రాజేంద్రప్రసాద్, జీవీ సుబ్బరాజు, కే విశ్వమోహన్, కేపీ ఆజాంఖాన్, ఎం మణిమంజరి, పీ దశరథరామయ్య, ఏ శివనాగప్రసాద్, ఎం కవిత, కే సావిత్రీ, డీ గోపీకృష్ణ, డీ బంగారమ్మ, పీ మహబూబ్‌ఖాన్, జీ మోహన్‌కుమార్, ఎన్‌సీహెచ్ వాసుదేవగుప్త, సీ వెంగన్న, ఎండీ మహబూబ్‌దౌలా, ఎం శ్రీనివాసులు, అల్లంరాజు శ్రీనివాసరావు, ఎస్ మంజులవాణి, కే దాసరి మేరీ, జీ నాగశేషాచలరెడ్డి, ఎం శోభారాణి, జీ వెంకటేశ్వరరెడ్డి, బీవీ రమణ, ఎం దస్తగిరి ఉన్నారు.

వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయిన వారు..

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయిన వారిలో సీ శివమల్లేశ్వరప్ప, ఎం ఫజుల్ రహమాన్, పీ మధుసూదన్‌రెడ్డి, కేవీ సుబ్రమణ్యం, ఎస్ ఉమామహేశ్వరరావు, ఎస్ అమానుల్లా, ఎస్ సుగుణశ్రీ ఉన్నారు.

అశేష జనవాహిని మధ్య నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం



నయన మనోహరం



ప్రత్యేక అలంకరణలో నీలకంఠేశ్వర స్వామి

- ఎమ్మిగనూరులో వైభవంగా నీలకంఠేశ్వర స్వామి మహారథోత్సవం
- భారీగా తరలివచ్చిన భక్తజనం

ఎమ్మిగనూరు: 'హరోంహర.. హరహర మహాదేవ.. శంభోశంకర.. ఓం నమ శివాయ' అంటూ భక్తజనం ముక్తకంఠంతో స్మరిస్తున్న వేళ.. పండితుల వేద మంత్రోచ్ఛారణలు.. మంగళవాయిద్యాలు.. జానపద ప్రదర్శనల మధ్య మహాదేవుని మహారథోత్సవం వైభవంగా సాగింది. నీలకంఠేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 6.30 వరకు మహారథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవమూర్తికి విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం తేరుబజార్ వరకు ఉత్సవమూర్తిని పూర్ణ కలశాలతో మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చారు. తేరు బజార్‌లో స్వామి వారిని పీఠంపై ఆశీనులను చేసి హోమం జరిపారు. పూర్ణకుంభంతో స్వామి వారికి నైవేద్యం సమర్పించి హోహం చుట్టూ స్వామి వారిని ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఉత్సవమూర్తిని మహారథంపై అధిష్ఠింపజేసి హారతి ఇచ్చారు. రథోత్సవాన్ని పురోహితులు ప్రారంభించగా.. భక్తజనులు హర నామ స్మరణ చేస్తూ రథాన్ని లాగారు. రథాన్ని లాగి స్వామివారి కృపను పొందాలని గొల్లలు, వడ్డెరులతోపాటు భక్తులు పోటీపడ్డారు. మార్కండేయస్వామి ఆలయం మీదుగా చేపల మార్కెట్ వరకు రథాన్ని తీసుకెళ్లారు. మార్కండేయ స్వామి, ఎదురుబసవన్నకు విశిష్టపూజలు నిర్వహించిన అనంతరం రథాన్ని తిరిగి యథాస్థానానికి చేర్చి ఉత్సవానికి ముగింపు పలికారు. వేడుకను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుండే కాక కర్ణాటక, మహారాష్ట్ర, తమిళ నాడు ప్రాంతాల నుంచి భారీగా భక్తులు వచ్చారు. రథోత్సవం ముగిసిన వెంటనే చిరు వ్యాపారులు అంగళ్లను ఏర్పాటు చేసుకోవటంతో జాతర సందడి మొదలైంది.

సచివాలయాలు, ఆర్‌బీకే సేవలు అద్భుతం

- మాల్దీవుల బృందం కితాబు



రైతు భరోసా కేంద్రం వద్ద ఉడుములపాడు గ్రామ ప్రజలతో మాల్దీవుల బృందం సభ్యులు

డోన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా, గ్రామ సచివాలయాల సేవలు అద్భుతమని మాల్దీవుల బృందం కితాబునిచ్చింది. మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామాన్ని 23 మంది సభ్యులతో కూడిన మాల్దీవుల బృందం శనివారం సందర్శించింది. గ్రామంలో ప్రజలకు సేవలు అందిస్తున్న కార్యాలయాలను సందర్శించారు. అనంతరం గ్రామ సమీపంలోని పంట పొలాలను పరిశీలించారు. అనంతరం గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద ప్రజలతో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలు, పథకాల గురించి బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. అలాగే పొదుపు సంఘాల ద్వారా పేదలు ఎలా లబ్ధి పొందుతున్నారని, గ్రామంలో ప్రజలకు సమస్యలు వస్తే ఎలా పరిష్కరించుకుంటారని అడిగితెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయ, రైతు భరోసా సేవలు చాలా అద్భుతంగా ఉన్నాయని అన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఉప్పరి రాధ, ఎంపీడీఓ శ్రీనివాసులుల ఆధ్వర్యంలో బృందాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మల్దీవ్‌ల బృందం డాక్టర్ అంజన్‌కుమార్ భాజన్, (సీపీఆర్‌డీపీఅండ్ఎస్ఎస్‌డీ), ఏ.శిరీష ప్రాజెక్ట్ ట్రైనింగ్ మేనేజర్, చిన్నమల్కాపురం డాక్టర్ చెన్నకేశవులు, పంచాయతీ కార్యదర్శి రష్మిత, రామాంజినేయులు, గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, హెల్త్ సూపర్‌వైజర్ చెన్నయ్య, ప్రభాకర్, ఐసీడీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

ఉయ్యాలవాడ: రబీలో సాగు చేసిన ప్రతి పంటను ఈ క్రాప్ నమోదు చేసిన వెంటనే ఈకేవైసీ పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు సూచించారు. శనివారం మండలంలోని పెద్దయమ్మనూరు, బోడెమ్మనూరు, ఇంజేడు రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. అధికారులు రైతులకు అందుబాటులో ఉండి సాగు చేసిన పంటలను పరిశీలించి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఉన్నారు.



పెద్దయమ్మనూరులో ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న డీఏఓ మోహనరావు

దళితులు ఆర్థికంగా ఎదగాలి

- స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ పీవీ సునీల్ కుమార్

ప్యాపిలి: దళితులు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ పీవీ సునీల్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో శనివారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సునీల్ కుమార్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగాన్ని రచించారన్నారు. రాజ్యాంగ ఫలాలు సక్రమంగా అందాలంటే ప్రతి ఒక్కరూ కష్టపడి చదవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని దళితులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలన్నారు. అంతకు ముందు వివిధ గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన దళితులు చిగుర్‌మాన్ క్రాస్ రోడ్డు నుంచి హుసేనాపురం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. భారీగా తరలివచ్చిన జనంతో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ప్రాంతం కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో ఏఐఎం రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జి శోభన్‌బాబు, నంద్యాల జిల్లా ఫైర్ ఆఫీసర్ జయన్న, ప్యాపిలి సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ విజయ్‌కుమార్, స్థానికులు గుండాల చంద్రశేఖర్, జయపాల్, కిరణ్‌కుమార్, లోకేశ్, రాఘవేంద్ర, జయరాజు, రాశిపోగుల బాలరాజు, గవ్వల రాజశేఖర్, శంకరయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పీవీ సునీల్ కుమార్

క్లుప్తంగా


ఎమ్మెల్యే కాటసాని చొరవతో కేసీకి నీరు



ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న రైతులు,నాయకులు


గడివేముల: పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి చొరవతో మండల పరిధిలోని కేసీ కాలువకు నీరు వచ్చాయి. దీంతో శనివారం రైతులు ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో సన్మానించారు. చిందుకూరు, పెసరవాయి, గడిగరేవుల, కరిమద్దెల, తిరుపాడు, కొరటమద్ది గ్రామాల్లో రైతులు మినుము, జొన్న పంటను సాగు చేశారు. పంట బాగా ఉందని, ఈసారి మంచి దిగుబడులు వస్తాయని అనుకున్న సమయంలో కేసీకి నీరు ఆగిపోయింది. దీంతో ఆందోళన చెందిన రైతులు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో మాట్లాడి కేసీకి నీటిని విడుదల చేయించారు. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల రైతులు శనివారం కర్నూలులోని ఎమ్మెల్యే స్వగృహానికి వెళ్లి కాటసానిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు బాగుంటే రాష్ట్రం బాటుందని నమ్మిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రైతులకు ఎల్లవేళల అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లయ్య, డాటుస్వామి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపీడీఓ మృతి




అజాంఖాన్ (ఫైల్)

కర్నూలు సిటీ/డోన్‌రూరల్: కర్నూలు రూరల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా పని చేస్తున్న కె.ఎ అజాంఖాన్ శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన డోన్ పట్టణంలో నివాసం ఉంటున్నారు. ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు డోన్ నుంచి కర్నూలుకి 6.30 గంటలకే వచ్చేవారు. ఎప్పటిలాగే రైల్వే స్టేషన్‌కి 5.30 గంటలకు లంచ్ బాక్స్‌తో వచ్చారు. ఫ్లాట్‌ఫాం దగ్గర రైలు కోసం నిలబడి ఉండి హఠాత్తుగా గుండెపోటుకు గురై నిలబడిన చోటనే ఆ పక్కనే ఉన్న రైల్వే పోలీసుపై పడిపోయాడు. పల్స్ పడిపోవడంతో సీపీఆర్ సైతం చేశారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో విషయం ఎంపీడీఓ భార్యకు తెలియజేగా, అక్కడికి చేరుకున్న ఆమె చికిత్స కోసం డోన్ హాస్పిటల్‌కి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ డోన్‌లోని అజాంఖాన్ ఇంటికి చేరుకొని పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ సీఈఓ జీ నాసర రెడ్డి, పలువురు ఎంపీడీఓలు, జెడ్పీ ఉద్యోగులు సంతాపం తెలియజేశారు.




వాల్మీకి గుహల ముఖద్వారం



నంది రూపం.. భక్తిభావం



అపురూపం..శివలింగాలు




అందాల లోకం.. గుహలోపలి దృశ్యం

వాల్మీకి దృశ్య కావ్యం

సహజసిద్ధంగా జాలువారే నీటి ధారలతో అందమైన ఆకృతులు రూపుదిద్దుకున్నాయి. చేయి తిరిగిన శిల్పులు సైతం సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యేలా వివిధ రూపాల్లో ఆకారాలు ఏర్పడ్డాయి. ఇవన్నీ ఉమ్మడి కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండలం నల్లమేకల పల్లి దగ్గర ఉన్న వాల్మీకి గుహల్లో దర్శనమిస్తున్నాయి. బెలూం కేవ్స్, బొర్రా గుహలను సైతం తలదన్నే విధంగా అత్యంతం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. అతి ప్రాచీన చరిత్ర కలిగిన రామాయణంతో ముడిపడి ఉండటంతో ఈ గుహలకు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక్కడ వాల్మీకి మహర్షి తపస్సు చేశారని ప్రచారం ఉంది. గుహల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన శివ లింగాన్ని పూజించి అక్కడ ఉన్న నీటిని తెచ్చుకొని పొలాల్లో చల్లుకుంటే పంటలు బాగా పండుతాయని స్థానికుల విశ్వాసం. వారి విశ్వాసానికి అనుగుణంగా జరుగుతుండటంతో సంక్రాంతి, శివరాత్రి పర్వదినాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు ఇక్కడికి వచ్చి పూజలు చేస్తుంటారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఏపీ టూరిజం ఆధ్వర్యంలో ఇక్కడ వివిధ అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. గుహల్లోకి వెళ్లడానికి ఐరన్ మెట్లు, గుహల లోపల లైటింగ్, పర్యాటకులకు ఇబ్బంది కలగకుంగా ఫ్యాన్లు ఏర్పాటు చేయించారు. గుహల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన వినాయక రూపం, శివలింగం, శివలింగంపై పడే నీటి ధారలు, రుద్రాక్షలు, నాగ పడగలు, నాగ పడగపై కృష్ణుడు నిలిచి ఉన్న రూపాలను చూసి తీరాల్సిందే..

– ఫొటోలు: డి. హుస్సేన్, సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



గుహలోపల నీటి జాడలు..



ఆశ్చర్యం.. నాగ పడగల ఆకారం



అద్భుతం.. గుహలోపల మరోప్రపంచం



స్తంభం.. సహజసిద్ధ రూపం



ప్రకృతి చెక్కిన శిల్పం..శివలింగం



సౌకర్యవంతం.. గుహలోపల ఇనుప మెట్లు



మరో ప్రపంచం.. మిలిమిట్లు గొలిపే అలంకారం



ఆతిథ్యం.. ఏపీ టూరిజం రెస్టారెంట్



రుద్రాక్ష.. అచ్చెరువొందే ముద్ర



గుహలోపల సందర్శకులు (ఇన్‌సెట్) ఏర్పాటు చేసిన ఫ్యాన్


ఉపాధ్యాయులకు గాయాలు

దేవనకొండ: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ఉపాధ్యాయులకు గాలయ్యాయి. ఈ ఘటన కప్పట్రాళ్ల–ఈదులదేవరబండ మధ్య శనివారం చోటుచేసుకుంది. పత్తికొండలోని ప్రభుత్వ, మోడల్ స్కూళ్లల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రతిరోజూ క్రూజర్ వాహనంలో కర్నూలు నుంచి వచ్చేవారు. రోజూ మాదిరిగానే శనివారం కూడా క్రూజ్ వాహనంలో బయలుదేరారు. కప్పట్రాళ్ల–ఈదులదేవరబండ మధ్య వీరి వాహనం లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా లారీకి ఉన్న రేకు వాహనం డోర్‌కు తగిలింది. దీంతో క్రూజ్ వాహనంలో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయులు హరిశంకర్, వనజాక్షి, విగ్నేష్‌లకు గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు 108 వాహనంలో క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఐ మిస్‌యూ బాబాయ్!

- ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వాట్సాప్ స్టేటస్
- సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో గాలింపు చర్యలు చేపట్టినా దొరకని ఆచూకీ

కర్నూలు: 'బాబాయ్.. అన్నకి కొంచెం క్లారిటీగా చెప్పు.. అన్నీ... అమౌంట్‌ది కూడా... ఐ మిస్‌యూ బాబాయ్.. సమ్మర్ స్టోరేజ్ లొకేషన్... కమాన్ టు టేక్ హోం... డీజే పెట్టించి బ్యానర్లు వేయించి నా బాడీని తీసుకుపోండి... ఉంటాను బాబాయ్... లొకేషన్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, సంతోష్‌నగర్' అంటూ జొహరాపురం గ్రామానికి చెందిన పురుషోత్తం గౌడ్ (23) లొకేషన్‌ను వాట్సాప్ స్టేటస్‌తో పాటు మెసేజ్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేయడం సంచలనంగా మారింది. దీంతో కుటుంబ సభ్యులు, పోలీసులు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్దకు వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే పురుషోత్తం గౌడ్ ఆచూకీ లభించలేదు. జొహరాపురం గ్రామానికి చెందిన అనసూయమ్మ, లింగన్న గౌడ్ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం కాగా, రెండో కుమారుడైన పురుషోత్తం గౌడ్ బేతంచెర్లలో శ్రీరాం ఫైనాన్స్‌లో గోల్డ్ లోన్ రికవరీ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై కర్నూలులోని సంతోష్ నగర్ వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్దకు చేరుకున్నాడు. బైక్‌ను అక్కడే పార్క్ చేసి సెల్‌ఫోన్‌లో సెల్ఫీ దిగి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టి సూసైడ్ చేసుకుంటున్నట్లు మెసేజ్ రూపంలో బాబాయ్ శివకుమార్ గౌడ్‌కు మెసేజ్ పెట్టాడు. దానిని గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కర్నూలు అర్బన్ తాలూకా పీఎస్ ఎస్‌ఐ షమీర్ అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించాడు. బైక్‌తో పాటు సెల్‌ఫోన్, మెడలో వేసుకునే పూసల దండ, చెప్పులను స్వాధీనం చేసుకున్నారు. సాయంత్రం వరకు గాలించినా పురుషోత్తం గౌడ్ ఆచూకీ లభించలేదు. నిడ్జూరు, కొంతలపాడు గ్రామాల నుంచి గజ ఈతగాళ్లు, చేపల జాలర్లను పిలిపించి వలలు వేసి కూడా గాలించినా ఆచూకీ లభించలేదు. కర్నూలు అశోక్‌నగర్ వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్స్‌కు నీటి సరఫరాను కూడా నిలిపివేసి గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో కర్నూలులోని కొన్ని కాలనీలకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.



వాట్సాప్ ద్వారా చేరవేసిన సమాచారం, పురుషోత్తం గౌడ్ ఫొటో

ఇంజినీరింగ్ విద్యార్థి ప్రసవం

- తీవ్ర రక్తస్రావంతో తల్లి మృతి

పాణ్యం: ఓ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థి ప్రసవం కలకలం రేపింది. ఈ విషయం బహిర్గతం కావడంతో పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు. పాణ్యం ఇంచార్జి సీఐ శివకుమార్‌రెడ్డి శనివారం పాణ్యం సర్కిల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి శుక్రవారం అర్ధరాత్రి కడుపునొప్పిగా ఉందని రాత్రి తల్లిదండ్రులకు ఫోన్ చేసింది. ఆ సమయంలోనే తల్లిదండ్రులు హాస్టల్‌కు చేరుకున్నారు. అయితే కడుపునొప్పి తీవ్రం కావడంతో బాత్‌రూమ్‌కు వెళ్లింది. ఎంత సేపటికి బయటకు రాకపోవడంతో తోటి స్నేహితులు, అప్పటికే హాస్టల్‌కు చేరుకున్న తల్లిదండ్రులు తలుపును బద్దలుకొట్టారు. అయితే అప్పటికే ఆ విద్యార్థి ఆడబిడ్డకు జన్మనిచ్చి రక్తపుమడుగులో పడిఉంది. విద్యార్థి తల్లిదండ్రులు హుటాహుటిన ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. తీవ్ర రక్తస్రావంతో కోలుకోలేక విద్యార్థి మరణించగా పసిబిడ్డ ఆరోగ్యంగా ఉంది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.